క్లుప్తంగా

పెనమలూరులో వైఎస్సార్ కంటివెలుగు

పెనమలూరు: నేత్ర సమస్యలు పరిష్కరించటానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎ.జేజికుమారి అన్నారు. పెనమలూరు సచివాలయంలో బుధవారం వృద్ధులకు నేత్ర పరీక్షలు చేశారు. గ్రామంలో క్యాంపు 20 రోజుల పాటు నిర్వహిస్తామని, వృద్ధులకు కంటి శుక్లాలు, ఇతర పరీక్షలు ఉచితంగా చేస్తామని డాక్టర్ జేజికుమారి తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేసి కళ్లజోడు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద ఆర్థిక సాయం అందించారు. గంగూరు గ్రామానికి చెందిన కలపాల శ్రీను ఈ నెల 19వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద ఉప సర్పంచి పోసిపోగు విజయకుమారి తక్షణ సాయం కింద రూ.10 వేలు నగదు బుధవారం మృతుడి ఇంటికి వెళ్లి మృతుడి భార్య కలపాల కుమారికి అందచేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది డొక్కు దుర్గ, ఎస్.రాజేష్ బాబు, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు అండ

కంకిపాడు: వైఎస్సార్ బీమా పేదలకు అండగా నిలుస్తుందని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో ఇటీవల మృతి చెందిన చీలి ఆంజనేయులు కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. సర్పంచ్ విజయ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందిస్తూ ప్రభుత్వం సమర్థంగా పాలన సాగిస్తుందన్నారు. బీమా వర్తింపుతో ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి భార్గవి, పార్టీ అధ్యక్షుడు ఇంటూరి రామయ్య, నాయకులు మావులూరు కృష్ణ, ఇంటూరు చిన్న తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు ఎస్ఐగా సుధాకర్ బాధ్యతల స్వీకారం



కంకిపాడు: కంకిపాడు పోలీసుస్టేషన్ నూతన ఎస్ఐగా కె.సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వై.దుర్గారావు గత నెలలో జరిగిన బదిలీల్లో గన్నవరం ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఎస్ఐ పోస్టు భర్తీ కాలేదు. తాజా ఉత్తర్వుల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.సుధాకర్‌ను కంకిపాడు బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు మెరుగైన చర్యలు తీసుకుంటానని, పోలీసు సేవలు సమర్థంగా అందేలా చూస్తానని చెప్పారు.

యువతికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న సూరంపల్లికి చెందిన పులపాక ఆశకు వైద్య చికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని బుధవారం స్థానిక శాసన సభ్యుని కార్యాలయంలో గ్రామ సర్పంచి పులపాక బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు కొండా సీతారామయ్య ఆశ బంధువులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల కన్వీనర్ కైలే శివకుమార్, మాజీ సర్పంచి నీలం ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ పామర్తి మాధవ్ పాల్గొన్నారు.

ఏపీజేఏసీ జిల్లా చైర్మన్‌గా టీవీ సతీష్

కంకిపాడు: ఏపీ జేఏసీ అమరావతి- కృష్ణా జిల్లా నూతన చైర్మన్‌గా కంకిపాడు తహసీల్దార్ టీవీ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. జిల్లా నూతన చైర్మన్‌గా నియమితులైన కంకిపాడు తహసీల్దార్ టీవీ సతీష్‌ను కంకిపాడు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. జిల్లా కార్యవర్గ ప్రతినిధులకు టీవీ సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

దశాబ్దాల దాహార్తికి తెర

- రూ 2.16 కోట్లతో వాటర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు
- త్వరలో నూతనంగా 4 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఎనికేపాడులో వాటర్ ప్రాజెక్టుకు ప్రతిపాదించిన రామయ్య చెరువు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. గత టీడీపీ హయాంలో గాలికొదిలేసిన తాగునీటి సమస్యను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీరు అందించే దిశగా ప్రస్తుత సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు ముందుకు వెళుతున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామంలో సుమారు 18 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇప్పటివరకు గ్రామం మొత్తానికి ఒకే ఒక వాటర్ ట్యాంకు, 17 మోటారు బోర్లతోనే తాగునీరు సరఫరా అవుతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడానికి తోడు ఈ సమస్యపై గత పాలకులు దృష్టి సారించకపోవడంతో గ్రామస్తులు ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా తరచూ తాగునీటిని సరఫరా చేసే మోటారు బోర్ల మరమ్మతులు, పెరుగుతున్న విద్యుత్ బిల్లులు భారంగా తయారైన తరుణంలో ఈ వాటర్ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరం కానుంది.

3 ఎకరాల విస్తీర్ణంలో...

గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో గ్రామంలో 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రామయ్య చెరువు వద్ద డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) నిధులు రూ.2.16 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. ఈ చెరువులో రైవస్ కాలువ నీటిని నింపి ఫిల్టర్ బెడ్‌ల ద్వారా శుద్ధి చేసి గ్రామంలో తాగునీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మంచినీటి ప్రాజెక్టు మంజూరు కోసం ఇటీవల జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 14వేల మందికి మంచినీటిని సరఫరా చేయవచ్చని అంచనాకు వచ్చారు.



కల్యాణ మండపం సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి పూర్తి చేసుకున్న మెరక పనులు

త్వరలో మరో 4 వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం

ఈ ప్రాజెక్టుతో పాటు గ్రామంలో మరో 4 నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం జరగనుంది. గ్రామంలోని 24కే కల్యాణ మండపం సమీపంలోని కామన్ స్థలంలో 1.20 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్, హిందూ శ్మశానవాటిక సమీపంలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు, విజ్ఞాన్‌విహార్ పాఠశాల సమీపంలోని కామన్ స్థలంలో 2.50 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు, జెండాచెట్టు సెంటర్ సమీపంలో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా సుమారు రూ.70 లక్షలతో 24కే కల్యాణ మండపం సమీపంలో 1.20 లక్షల లీటర్ల ట్యాంకు, హిందూ శ్మశానవాటిక సమీపంలో 60 వేల లీటర్ల ట్యాంకుల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. వీటి నిర్మాణానికి టెండర్లు కూడా ఆహ్వానించారు.

తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగుతాయి



గ్రామంలో నెలకొల్పనున్న తాగునీటి ప్రాజెక్టు, 4 నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం ద్వారా తాగునీటి కష్టాలు పూర్తిగా పరిష్కారమవుతాయి. వాటర్ ప్రాజెక్టులో భాగంగా ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం కోసం చెరువు పక్కనున్న కామన్ స్థలం అనువుగా ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.2.16 కోట్లతో అంచనాలు వేశారు. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసే విధంగా ముందుకు వెళుతున్నాం.

– రాచమళ్ల పూర్ణచంద్రరావు, ఎనికేపాడు సర్పంచ్

పార్టీకి, ప్రజలకు వారధులు గృహసారథులు

- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు మార్గనిర్దేశం
- కంకిపాడు మండల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- హాజరైన జగనన్న సచివాలయాల రాష్ట్ర ఇన్‌చార్జి రవీంద్రరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, పక్కన సచివాలయాల రాష్ట్ర ఇన్‌చార్జి రవీంద్రరెడ్డి

కంకిపాడు: గృహసారథులు పార్టీకి, ప్రజలకు వారధులుగా ఉంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల మండల స్థాయి సమీక్ష సమావేశం ఈడుపుగల్లులోని శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థను స్థాపించి ప్రతి ఇంటికీ, రాజకీయాలకు తావులేకుండా పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరో మారు సంక్షేమ రాజ్యాన్ని అధికారంలోకి తేవటమే లక్ష్యంగా పాటుపడాలన్నారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలను సమన్వయంతో, సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. జగనన్న సచివాలయాల రాష్ట్ర ఇన్‌చార్జి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో, సమష్టిగా పనిచేయాలన్నారు. మార్చి 1న అందించే వైఎస్సార్ పింఛను కానుక ద్వారా ప్రతి ఒక్కరూ లబ్ధిదారు ఇంటికి వెళ్లి పలకరించాలన్నారు. 18వ తేదీ నుంచి చేపట్టనున్న క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేలా సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, నగర, ఉమెన్ ఫైనాన్స్, కమ్మ, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, నందిపాటి బిందుమాధవి, రామినేని రమాదేవి, ఈడే చాముండేశ్వరి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సర్పంచ్ బాకీ రమణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ బిళ్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు ఆర్‌సీఎం పాఠశాలలో విద్యార్థులకు దాతలు విద్యాసామగ్రిని అందించారు. గ్రామానికి చెందిన వెంగల సీతారామయ్య, రాఘవమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు డాక్టర్ వెంగల శివ శంకరరావు, సత్యనారాయణమ్మ 100 మంది విద్యార్థులకు బ్యాగులు, విద్యాసామగ్రి, బాక్సులను బుధవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్‌రావు, ఉపసర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: 16వ నంబరు జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ శివారులోని డెల్టా షుగర్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడ వైపు వెళుతున్న వాహనం ఎడమవైపు ఫ్రంట్ టైర్ ఆకస్మాత్తుగా పేలటంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. దీంతో అదుపు తప్పిన వాహనం హైవే డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరుకు చెందిన యు.హనుమంతరావు, ఆయన భార్య సరోజ, గన్నవరానికి చెందిన జి.నవీన్, రత్నతేజలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సేఫ్టీ ఎస్ఐ సుందరరావు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు.

ఇద్దరు వ్యక్తులకు గాయాలు

పెనమలూరు: కానూరు వందడుగుల రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట ఆర్టీసీ కాలనీకి చెందిన యలమంచిలి రామకృష్ణ, కె.రామారావు ఎనికేపాడు నుంచి తాడిగడప సెంటర్ వైపునకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది.ఈ ఘటనలో వీరిద్దరికి తీవ్ర గాయాలవటంతో స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు చేరారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి

ఉంగుటూరు: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ ఇచ్చి అవసరమైన సహకారాన్ని అందజేస్తామని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టులోని స్వశక్తి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వివేకానందశర్మ తెలిపారు. ఆయన బుధవారం ముక్కపాడు సచివాలయాన్ని సందర్శించి స్వయం ఉపాధి కోర్సుల వివరాలను సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో రవాణా సౌకర్యం లేక ట్రస్టుకు రాలేని వారి కోసం వారి గ్రామాల్లోనే కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. ఎనిమిదో తరగతి చదివి 18–45 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు కుట్టు శిక్షణ పొందేందుకు సచివాలయంలో వలంటీర్లకు తెలియజేయాలని సూచించారు.

వేగంగా తనిఖీలో ఎన్‌డీటీ దోహదం

ఉంగుటూరు: వేగంగా, పొరపాట్లు లేకుండా తనిఖీలు చేయడంలో ఎన్.డి.టి కీలక పాత్ర పోషిస్తుందని అమరావతి విట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీకాంత్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ ఇండస్ట్రియల్ ప్రాస్పెక్ట్స్ అనే అంశంపై రెండు రోజుల కార్యశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక రంగాల్లో నాణ్యతా తనిఖీలు కీలక పాత్ర పోషిస్తాయని, దానికి అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

యనమలకుదురులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట అచ్చెమ్మబజార్‌కు చెందిన కందుల శివరామకృష్ణ గత కొంత కాలంగా యనమలకుదురు పెద్ద కట్ట హోసన్న మందిరం వద్ద నూడిల్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతని షాపు పక్కన ఉన్న మణీంద్ర చెత్త సామగ్రి వ్యాపారం చేస్తుంటాడు. మణీంద్ర షాపులో సామాను తరచుగా చోరీ జరుగుతుండటంతో శివరామకృష్ణపై అనుమానంతో ఘర్షణ పడ్డాడు. శివరామకృష్ణపై మణీంద్ర, అతని మిత్రులు సంతోష్, ఆకాష్, దుర్గాప్రసాద్ దాడి చేశారు.ఈ ఘటన పై బాధితుడు శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ



బాపులపాడులో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోతారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు, వేలేరు గ్రామాల్లో లబ్ధిదారులైన 644 మంది పేదలకు బుధవారం ఆయన ఇళ్లస్థలాలను పంపిణీ చేశారు. స్థానిక నూజివీడు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరిగిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతేడాది బాపులపాడులో తొలివిడతగా సుమారు 600 మందికి ఇళ్లస్థలాలను పంపిణీ చేయగా, రెండవ విడతలో 20 ఎకరాల లే అవుట్‌ను ఏర్పాటు చేసి మరో 621 మందికి పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటమే కాకుండా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.

లబ్ధిదారుల అవధులు లేని ఆనందం

ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇళ్ల స్థలాల పట్టాలు అందుకున్న లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పలువురు లబ్ధిదారులు పట్టాలు స్వీకరించిన తర్వాత సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వంశీ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలంటూ తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, గన్నవరం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజినీకుమారి, డైరెక్టర్లు పసుపులేటి మురళి, గండేపూడి రాణి, బళ్లా గంగారావు, జెడ్పీటీసీ సభ్యులు కొమరవల్లి గంగాభవాని, అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దయాల విజయనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకున్న సీఎం జగన్

గడపగడపలో లబ్ధిదారుల హర్షాతిరేకాలు



కానూరు కల్పనానగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్రంలో నిరుపేదలను సీఎం జగన్ ఆదుకున్నారని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో తమ కుటుంబానికి న్యాయం జరిగిందని మూడున్నరేళ్లలో రూ.5.22 లక్షలు సాయం పొందిన గౌసియా అన్నారు. జగనన్న పాలనలోనే తమ కుటుంబం సంతోషంగా ఉందని రూ.5.90 లక్షలు లబ్ధిపొందిన కరీమున్నీసా ఆనందంతో తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి బుధవారం కానూరు కల్పనానగర్‌లో విస్తృతంగా పర్యటించి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందిన పథకాల వివరాలతో ఉన్న బ్రోచర్లు అందజేశారు. కల్పనానగర్‌లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. నిధులు మంజూరు చేసి సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పార్థసారథి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్ కుమార్, వేమూరి బాలకృష్ణ, తూమాటి శ్రీరాములు, నర్రా ఆంజనేయప్రసాద్, సిద్ధిఖ్, చాంద్‌బాషా, తాళ్ల నరేంద్ర, అంగిరేకుల సీతారామయ్య, రెహమాన్, లతీఫ్, క్రిస్టోఫర్, రమేష్, సింహాద్రిరాజు పాల్గొన్నారు.

24 నుంచి సుందరేశ్వరస్వామివారి ఆలయ వార్షికోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి సమేత శ్రీ విజయ సుందరేశ్వరస్వామివారి ఆలయం సప్తమ వార్షికోత్సవాలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్నామని శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ తెలిపారు. గ్రామంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో స్వామీజీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ లలితా సహస్రనామ సామూహిక కుంకుమార్చన, 25న సామూహిక సత్యనారాయణస్వామి వారి వ్రతం, 26న 108 మంది దంపతులతో చండీహోమం, రాత్రి 7 గంటలకు రథోత్సవం, అనంతరం శాంతి కల్యాణం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో తొండెపు హనుమంతరావు, వల్లూరు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వృద్ధుడికి కళ్లజోడు అందజేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 170 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, సర్పంచ్ లాం సోనియా, పార్టీ నాయకులు నెరుసు సతీష్, లాం సురేష్, ఆరోగ్య సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పద్మావతి, రామారావు, రాచమళ్ల శ్యాంప్రసాద్, కెనడీబాబు, భవాని పాల్గొన్నారు.

తపస్సు కాల దీక్షలు స్వీకరించిన భక్తులు



భక్తులకు తపస్సు కాల దీక్షలను అందజేసి సందేశమిస్తున్న ఫాదర్ ఆంతోని బాలజోసఫ్

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద, కొండపావులూరు ఆర్సీఎం విచారణలలో బుధవారం భక్తులు తపస్సు కాల దీక్షలు స్వీకరించారు. ముస్తాబాద విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఎం.ఆంతోని బాలజోసఫ్ భక్తులకు దీక్షలను అందజేశారు. తపస్సు కాలంలో లోకము నుంచి వేరుగా ఉంటూ యేసు ప్రభువును హృదయంలోకి ఆహ్వానించాలని చెప్పారు. దేవుని వాక్యము ఆచరించుటే నిజమైన ఆరాధన అని వివరించారు. క్రీస్తు ఆరాధనలో నిరంతరం గడపాలన్నారు. తపస్సు కాల నియమాలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన తపస్సు కాలం



భక్తుల నుదిటిపై విభూదితో సిలువ గుర్తు వేస్తున్న ఫాదర్

గన్నవరం: మండలంలోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం నుంచి తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. విభూది బుధవారం సందర్భంగా విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ పీకే జోసఫ్ నేతృత్వంలో దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం జోసఫ్ మాట్లాడుతూ తపస్సు కాలంలో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఉండాలని చెప్పారు. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణ వంటి గుణాలను కలిగి ఉండాలని సూచించారు. తొలుత తపస్సు కాలం గుర్తుగా భక్తుల నుదిటిపై విభూదితో ఫాదర్ సిలువ గుర్తు వేశారు. ఆలయ పెద్దలు, మరియదళ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

విజయవాడరూరల్: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో 40 రోజుల పాటు నిర్వహించే ఉపవాసాలతో కూడిన ప్రత్యేక ప్రార్థనలు భస్మ బుధవారం ప్రారంభమయ్యాయి. యేసుక్రీస్తు మానవాళి కోసం కల్వరిలో శిలువ యాగం చేయడానికి ముందు 40 రోజుల పాటు ఉపవాస దీక్ష చేస్తారనే విశ్వాసంతో క్రైస్తవులు ఈ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ 40 రోజులూ ప్రతి రోజూ ప్రత్యేక ప్రార్థనల్లో విషాద గీతాలను ఆలపిస్తారు. ఈ సందర్భంగా నున్న సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాస్టర్ రెవరెండ్ కె.జాన్‌వెస్లీ, పాస్టర్ సుధీర్ పాల్గొన్నారు. గ్రామంలో ఆర్‌సీఎం, దైవస్వరూపి, మరికొన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాతపాడు గ్రామంలో సీఎస్ఐ, కొత్తనిబంధన, క్రీస్తు సంఘం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. అంబాపురం సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రత్తిపాటి జాన్‌బాబు, క్రీస్తు సంఘం, పెంతెకోస్తు, పి.నైనవరంలో క్రీస్తు పరిశుద్ధ దేవాలయం, ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.